# ఈ కథకు ముగింపులేదు

## - అడబాల రాజ్యలక్ష్మి

''డాడీ! డాడీ! మీ గవర్నమెంట్ చేస్తున్న పని నాకు నచ్చలేదు.''

''అదేమిటిరా! మా గవర్నమెంట్‌ని దూషిస్తున్నావ్. ఆ సొమ్ముతో కాదుట్రా నువ్వింత వాడివయ్యింది'' అన్నాడు తండ్రి ధర్మారావుగారు.

''అయ్యాను సరే! నువ్వు మంచి వుద్యోగం చేశావు. ఆ జీతంతో మమ్మల్ని పెంచావు. పెద్ద వాళ్లను చేశావు. చదివించావు. బాగానే వుంది. ఇపుడు మేము బ్రతికేదెట్లా. అది ఆలోచించు.''

''దానికి వాళ్లేం చేస్తారూ!'' అన్నాడు ముసిలాయన, కాళ్లు రుద్దుకుంటూ. ఆయనకు ఏభై అయిదు సంవత్సరాలు, రైల్వేలో ఓ చిరుద్యోగిగా చేరి వివిధ రకాల ప్రమోషన్లు అందుకుంటూ, ఇప్పటికి ఓ ఆఫీసరై కూర్చున్నాడు. నలుగురు కొడుకులు కలిగిన ఆయన వాళ్లకేలోటూ రాకుండా చూసుకున్నాడు. నలుగురూ ఎవరికి నచ్చిన చదువులు వాళ్ళు చదువుకుని డిగ్రీలు అందుకున్నారు. ఆయన భార్య ఆయన హోదాకు తగినట్టు నడుచుకుంటూ నలుగురు కొడుకులనూ మంచి బుద్ధిమంతులుగానూ, ఆరోగ్యవంతులుగానూ తీర్చిదిద్దుకుంది. ఇప్పుడు వచ్చిన చిక్కల్లా ఎక్కడా ఒక్క కొడుక్కీ వుద్యోగం దొరక్కపోవటం. పెద్ద ఆఫీసరు కొడుకులుగా మంచి చదువులు చదివిన వాళ్లుగా వాళ్ళు చిన్నచిన్న పనులు చేసుకుని బ్రతకలేరు. అలాగని ఎంతకాలం తండ్రిమీద కూర్చోవటం, వాళ్లకర్థం కావటం లేదు. ఇరవై ఎనిమిది సంవత్సరాల పెద్దాడి నుంచి ఇరవై సంవత్సరాల చిన్నాడి వరకూ అందరూ నిరుద్యోగులే.

అందుకే ఈరోజు ధర్మారావుగారి పెద్దకొడుకు అలా తండ్రిమీద తగూవేసుకున్నాడు. ఆయనకు యిప్పటికే బి.పి, షుగరూ, వివిధ రకాల రోగాలతో బాధపడుతూ ఆఫీసుకు వెళ్లలేక వెడుతూ వున్నాడు. వాలంటరీ రిటైర్‌మెంట్ తీసేసుకుంటానని యింట్లో వాళ్లని బెదిరిస్తూ వుంటాడుగానీ అది బెదిరింపువరకే. అదీ కుదరదని ఆయనకు తెలుసు. ఆరుగురు సభ్యులున్న హోదాగల కుటుంబానికి యింకో ఆదాయం లేదు. ముసలాయన జీతమొక్కటే.

మధ్య తరగతి కుటుంబాలన్నీ కూడా వస్తూవస్తూ మోయలేనన్ని సిరిసంపదలు తెచ్చుకోలేవు. మహా అయితే వూరిలో పెచ్చులూడిపోయిన ఒక కొంప, పెళ్లికాల మందు అత్తవారిచ్చిన అరెకరం మడిచెక్కా వుంటాయి. ఉద్యోగంలో స్థిరపడి నోటికీ, చేతికీమధ్య మంచి సంబంధం ఏర్పడి ఫరవాలేదు అనుకునేసరికి యువ రాజులూ, యువరాణులూ పుట్టుకొస్తారు. అక్కడ్నుంచీ అయినవారు, ''మా వాడండీ-మంచి పొజిషన్‌లో వున్నాడు'' అని రాకపోకలు మొదలెడతారు. ఇక వీరూ వారూ ఏకమై చేసే భోజనాలకీ, అయ్యగారి హోదాకు తగినట్టు ఎదిగే పిల్లల చదువులకూ జీతం సరిపోతూ వుంటుంది. ఇటు ప్రమోషన్లతోటీ, యింక్రిమెంట్లతోటీ అయ్యగారి జీతం పెరుగుతూ వుంటుంది. అటు పెరిగే పిల్లలతోటీ-రోజులు జరిగేకొద్దీ మన యింటికి దారి బాగా తెలిసిపోయిన బంధువులతోటీ ఖర్చులు పెరిగిపోతూ వుంటవి.

ఎటూ కదలలేని స్థితి. నిష్ఠూరంగా మాట్లాడితే ఐనవారితో తంటా. మన సొమ్ము పోయి, యిల్లాలి కష్టమూపోయి, వూళ్లల్లో అంతా యాగీ. అందుకే ఆ చట్రంలో యిరుక్కుపోయిన మానవుడు యింక ఎటూ తెములుచ్చుకోలేక ఆ యాంత్రిక జీవితానికి అలవాటు పడిపోతాడు. తెల్లారితే తన నిత్యకృత్యాలు ముగించుకుని భార్య చేతికందించిన టిఫిను బాక్సుతో మానవుడు బస్సెక్కేస్తాడు. మళ్లీ ఏ రాత్రికో యింటికొచ్చిన ఆయనకు యిల్లంతా పడుగూ పేకగా పడుకున్న మనుషుల్లో పెళ్లాం ఎక్కడుందో, అందులో తన పిల్లలెవరో, పరాయి వాళ్లెవరో తెలీక బిక్కమొహం వేసుకొన్నాయనకు-ఎదురుగా చేబిలుమీద భార్య అన్నీ వడ్డించి మూతలు పెట్టిన వైనం కనిపిస్తుంది. మెల్లిగా ఎవరినీ తొక్కకుండా తడుముకుంటూ వెళ్లి బట్టలు మార్చుకొని కాళ్ళు కడుక్కొచ్చి చప్పుళ్ళు చెయ్యకుండా భోజనం ముగించుకుంటాడు. తరువాత యిల్లంతా వెతుకుతాడు. ఏదోమూల తనకు పక్కవేసి వుంచుతుం దాల్లావిడ. ఆ సంగతి ఆయనకు తెలుసు. అలా వెదికి పట్టుకున్న పక్కమీద వాలాడంటే, మళ్లీ బారెడు పొద్దెక్కిన తరువాతే ఆయన లేవడం.

''ఏరా ధర్మా! రాత్రి బాగా పొద్దుపోయి వచ్చావా?'' అంటారు వెనకనుంచి ఎవరో. అది ఆయన మేనమామ కావచ్చు, పినతండ్రి కావచ్చు, పెదనాన్న చిన్నాన్న బిడ్డలు కావచ్చు. ఎవరో మొత్తానికి తన పని ముగించుకుని వచ్చి వున్న కాస్సేపూ వాళ్లతో కబుర్లు చెబుతాడు. అప్పుడే భార్య యిద్దరికీ కలిపి యిచ్చిన కాఫీలూ టిఫిన్లూ పూర్తి చేసుకుంటాడు. ఈలోపులో కొన్ని కొత్తమొహాలు తొంగిచూసి ''బావున్నారా బావగారూ అనో-అన్నయ్య గారూ'' అనో పలకరిస్తారు. ఇందులో వాళ్లెవరో కూడా ఆ యజమానికి సరిగ్గా తెలీదు. ఓ చిరునవ్వు ముఖానికి తగిలించుకుంటాడు, అంతే.

''మీ ఆఫీసుకు టైమవుతుంది'' అని భార్య గుర్తు చెయ్యగానే దొరికిందిరా బాబు సాకు అని గబగబా లేచి స్నానం ముగించుకుని వచ్చి ఆ మూల కూర్చున్న దేవుడికి ఓ నమస్కార బాణం విసిరి తన చేతిలో టిఫిన్ బాక్స్‌తో తొమ్మిదింటికల్లా బస్టాండులో వుంటాడు.

అలా తనకు తెలీకుండానే, తన ప్రమేయం లేకుండానే ఆయనకు ఏభై సంవత్సరాలు గడచిపోయి, రిటైర్‌మెంటుకీ రోగాలకీ చేరువైపోతాడు. అలాగే మన ధర్మారావుగారు కూడా సకల రోగాలకూ దగ్గరై-కూర్చుంటే లేవలేక-లేస్తే మళ్లీ కూర్చోలేక-ఆఫీసు పని తప్పక అవస్థపడుతున్నాడు. అలాగని ఆయన భార్య అశ్రద్ధ ఏమీలేదు. 'షుగర్'కి చక్కెర తగ్గించి-బీపీకి ఉప్పు తగ్గించీ-కీళ్ల నెప్పులకు మర్దనాలు చేస్తూ చేతులు అరగ్గొట్టుకుంటూ వుంటుంది.

ఈలోపు వాళ్లకు తెలీకుండానే ఓ తరం గడిచిపోతుంది. అప్పుడు వచ్చే బంధుజనాలు, బావలూ, అన్నలూ-అంతా ముసలివాళ్లైపోయి బండి ఎక్కలేని వయసులో వీళ్లింటికొచ్చే బంధుజనం తగ్గుతారు. ఐతే పెరిగిపోయిన పిల్లలూ-వాళ్ల స్నేహితులూ-ఇంకా పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే ఆ వియ్యమందిన బంధువులూ-యిలా ఆ యిల్లు రెండోతరంలో ప్రవేశిస్తుంది.


మహా అయితే తను చేసింది-అదీ తల్లిదండ్రులు గతించిన తరువాత ఊర్లోవున్న పాత యిల్లూ-అత్తారిచ్చిన మడిచెక్కా అమ్మి-ఈ మహాపట్నంలో ఓ సొంత యిల్లు కట్టుగోగలిగాడు. అదీ తన డిపార్ట్‌మెంట్ 'లోను' పెట్టి నానా తిప్పలూ పడితే తప్ప పూర్తికాలేదు. ఉండడానికి ఆ యిల్లు వుందన్న ధీమా వున్నా-ఎవరిమట్టుకు వాళ్లకు పెళ్లిళ్లు చేసి బ్రతకండి అనటానికి బ్రతుకు తెరువులే కనిపించటం లేదు.

ఇప్పుడు తన ముప్పైఏళ్ల కాపురంలో అలిసిపోయి-విసిగిపోయిన శారదకు ఓ కోడలొస్తే బావుండుననేవుంది. అందుకే ఓ రోజు-

''ఏమండీ! మన పెద్దాడి పెళ్లి చేసేద్దామండీ'' అంది.

''చేస్తాం సరే. వాడేం చేస్తున్నాడూ అంటే ఏం చెబుతావే?''

''ఏంటండీ చెప్పేది. మనబ్బాయికేం లోటు. అందగాడూ, చదువుకున్నవాడూ, ఉండటానికి సొంత యిల్లున్నవాడు, వాళ్ల నాన్నో పెద్ద ఆఫీసరు. ఎవరైనా అడిగితే, అదే చెబుదామండీ. పెళ్లీ, పెత్తనాలు కూడ నన్నే చూడమంటారా ఏమిటి. మీరీ ప్రయత్నమున్నా చెయ్యండి. తరువాత నేను చూసుకుంటాను'' అని కొడుకుని గురించి మొగుడు దగ్గర బాగా మొరపెట్టుకుంది. ఆయనప్పటికి పేపరు చదవటంలో నిమగ్నమయ్యాడు. మెల్లిగా తలెత్తి



''అది కాదే! నా ఆరోగ్యం ఏమీ బాగాలేదు. ఇందులో ఒక్క కొడుక్కి ఉద్యోగమున్నా నేనీపాటికి నిజంగా ఉద్యోగం మానేద్దును. వేరేదారి లేని పరిస్థితుల్లో నేను రోజూ ఏడుస్తూ పని చేస్తున్నానంటే నమ్ము. అందులోకి నువ్వు కోడల్ని తెచ్చుకోవాలని ముచ్చటపడ్తే ఎలా చెప్పు.''

''అలాకాదండీ. గొడ్డొచ్చిన వేళా, బిడ్డొచ్చిన వేళా అన్నారు. కోడలొచ్చేవేళ మనబ్బాయికి పని దొరుకుతుందేమో. ప్రయత్నం చెయ్యండి.''

అప్పటికి భార్య నుంచి తప్పించుకోటానికి అలాగే అన్నాడు ధర్మారావుగారు.

ఓరోజు కొడుకు దగ్గర ఆ విషయమే కదిపి చూశాడాయన.

''మీ అమ్మ నీకు పెళ్లి చెయ్యమంటోంది.''

''ఆ! యిదొక్కటే నాకు తక్కువ. దానికి తల్లో పెట్టుకునే పువ్వులు కూడా మీరే కొనిద్దురుగాని'' అని తిట్టుకుంటూ ఆ కొడుకు వెళ్లిపోయాడు.

మరో రోజు ఆ ముసలి దంపతులు సమావేశమయ్యారు.

''ఏమండీ, పోనీ నేనో సలహా చెబుతాను. అదైనా వినండి.''

''ఏమిటది.'' అన్నాడాయన.

''మరి యీ రోజుల్లో మగాళ్లకంటే ఆడాళ్లకు వుద్యోగాలు సులువుగా వస్తున్నాయ్ కదా. అందుకని ఎక్కడయినా వుద్యోగస్తురాలిగా వున్న పిల్లను చూసి మనాడికి చేసేస్తే వాళ్లు బ్రతుకుతారండీ.''

''బావుందే నీ ఆలోచన. ఇన్నిరోజులూ అలసిపోయా నండీ, పులిసిపోయానండీ- కోడలు వస్తే కూర్చుని తింటానండీ అన్నావు కదే. ఇప్పుడుద్యోగం చేసే పిల్లంటే మరో బాక్సు నువ్వే తయారుచేసి, కోడలిని ఆఫీసుకు పంపించి- అది కన్న పిల్లల్ని నువ్వే పెంచి మరోసారి నువ్వు చిన్నపిల్లవైపోవాలి కదే'' అన్నాడు జాలిగా, వెటకారం పాలు కలిపి.

''పోదురూ మీరు. దెప్పటానికిది సమయం కాదు. ఎలాగో మనం బావుండగా వాళ్లకోదారి చూపాలండీ.''

''ఏం దారే గోదారి, పని దొరకనివాడికి పెళ్లి చేసి వాడినింకా బాధకు గురిచేస్తామా. అదీగాక తిని ఖాళీగా తిరిగి నీ కొడుకు చేత ఏ వుద్యోగస్తురాలు తాళి కట్టించుకోదేవ్. కాకపోతే వాడే అలాంటి పిల్లను చూసి ప్రేమిస్తే మన సమస్య తీరిపోతుంది. అలా చెప్పు నీ కొడుక్కి'' అన్నాడాయన నవ్వుతూ.

''ఊరుకోండి మీరు మరీనూ. నా పిల్లలు బుద్ధిమంతులండీ. అటువంటి పనులు చెయ్యరు.''

''ఇందులో బుద్ధిప్రసక్తి ఏమీలేదే. వాడికో పెళ్లాం కావాలి. అంతేగా. అది ఏదారి అనేది ముఖ్యంకాదు. భార్య-అందులో నీ కొడుకుని పోషించే భార్య కావాలి. అంతేగా.''

''చాల్లెండి మీ వెటకారాలు. దేన్నో ప్రేమించెయ్యటానికి కులం సాంప్రదాయం యివన్నీ చూసుకోద్దా.''

''ఓహో! ఔను కదూ. నీకన్నీ కావాలన్నమాట. సరే. కులం గిలం అంటే విన్నవాళ్లు వూరుకోరేవ్. గాంధీగారు ఏం చెప్పారు. కులమతాలు వుండకూడదనేగా. నువ్వా గాంధీగారి భక్తురాలివి కదా. ఏం నేర్చుకున్నావు మరి.''

''మీరు మరీను. కులమతాలు లేకపోవడం ఏమిటండీ. కాకపోతే కులాలకు పేర్లు మారాయంతే.''

''ఏమిటేవ్. ఏదో కొత్త సిద్ధాంతం లేవదీసినట్లున్నావ్. ఆ థియరీ ఏదో కాస్త చెప్పు వింటాను.''

''అదేనండీ. పూర్వం రెడ్డీ, రాజు, కమ్మ, కాపు, మాల, మాదిగ అని రకరకాల పేర్లతో కులాలుండేవండీ. వాటినిపుడేమో, ఎఫ్సీ, ఏసీ, బీసీ, యూసీ, డీసీ, ఎస్సీ, ఎస్టీ అని యిలా తక్కువ, మరీ తక్కువ-కొంచెం తక్కువ అని విడదీసి ఆ ప్రకారంగా వడ్డిస్తున్నారు కదండీ గవర్నమెంటు వారూ. ఇంక కులాలెక్కడికి పోయినట్టు'' చాలా వివరంగా చెప్పింది.

ఆమె థీరీకి ఆశ్చర్యంగా చూశాడాయన.

★ ★ ★

ఓరోజు ఆఫీసు నుంచి వస్తూనే ''ఏమేవ్'' అని గట్టిగా పిల్చారు ధర్మారావుగారు.

''ఏమిటండీ''

''మరీ, మన పెద్దాడికో సంబంధం చూశాను. అమ్మాయి ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుంది. మనకు అనుకూలమైన సంబంధం. అబ్బాయికేదో పని దొరికితే కోడలి చేత పనిమానిపించెయ్యొచ్చు. బావుంటుంది. ఎప్పుడెల్దాం.''

''ఉండండి. వాణ్నోమాటడిగి నిర్ణయించుకుం దాం'' అంది.

''అలాగే''

ఆరాత్రి కొడుకు దగ్గర విషయం కదిపింది. ముందు కొంత బెట్టుచేసినా కొడుకూ ఒప్పుకున్నాడు. ఈ శరీరానికీ, మనసుకీ ఎవడూ అతీతుడు కాడు కదా. పుట్టగానే పాప ఆకలికి ఏడుస్తుంది. పెరిగేకొద్దీ తమ జీవితావసరాలు తీర్చుకోటానికి ఎవరికి వీలైన దారిలో వారు ప్రయత్నిస్తారు. కొందరు నోటిలో వెండి చెంచాతో పుడతారు. వారి అవసరాలు వాళ్ల కాళ్ల దగ్గరే వుంటయ్. అలాకాకుండా మధ్యతరగతి వాళ్లవసరాలు, కొన్ని పోరాటాలు చేసి తీర్చుకోవలసి వుంటుంది. ఇంకా కింది తరగతి వారుంటారు. వారి అవసరాలు తీరకుండానే కాలం గడచిపోతుంది.

అలాగే ధర్మారావుగారి పెద్దకొడుకూ అవసరాల

# ఇంద్రజాలం ఆధారంగా తొలి తెలుగు టీవీ సీరియల్ మేజిక్-మేజిక్



ఇప్పటివరకూ ఇంద్రజాలం అద్భుతాశ్చర్యాలలో ముంచెత్తే ఒక వినోదంగా ప్రజల మనసులను రంజింపజేస్తూ వచ్చింది. అయితే ఈ ఇంద్రజాల కళతో సామాజిక చైతన్యాన్ని సాధించవచ్చునే ఆలోచనకు రూపం దిద్ది 'మేజిక్'కి ఒక సరికొత్త కోణాన్ని ప్రవేశపెట్టారు ప్రముఖ ఇంద్రజాలికులు, హిప్నాటిస్ట్ ప్రొ. బి.వి.పట్టాభిరామ్‌గారు. ఈ సరికొత్తకోణం 'మేజిక్-మేజిక్' అనే *13 వారాల టీవీ సీరియల్‌గా* దృశ్యీకరణ పూర్తి చేసుకుని హైదరాబాద్ దూరదర్శన్ ద్వారా ప్రేక్షకులకు మార్చి *17వ తేదీ నుండి* కనువిందు చేయబోతోంది.

విష్ణ వీడియోవిజన్ పతాకంపై రూపొందిన ఈ తొలి తెలుగు మేజిక్ టీవీ సీరియల్‌ని మేజిక్ వినోదంతో, పిల్లల అల్లరితో ఈ వేసవి సెలవులలో పిల్లలకు పూర్తి వినోద, విజ్ఞానాలను అందించబోతోంది.

ప్రధాన పాత్రలో ప్రొ. బి.వి.పట్టాభిరామ్ నటిస్తున్న ఈ టీవీ సీరియల్‌లో సమాజంలో వున్న మూఢనమ్మకాలను, మూర్ఖత్వాన్ని పారద్రోలడానికి రూపొందించిన మేజిక్ అంశాలు ఎంతో ఆసక్తికరంగా వున్నాయి.

ఈ సీరియల్‌లో మొత్తం వందకు పైగా మేజిక్‌లను చూపించడం జరిగింది. పిల్లలు కూడా మేజిక్ అంశాలను సులభంగా నేర్చుకునేందుకు వీలుగా చిన్న చిన్న అంశాలలో దాగిన 'రహస్యాన్ని'కూడా విప్పి చెప్పారు. తాయెత్తులను, మంత్రాలను, బాణామతి, పూనకాలు ఎంతటి బూటకాలో వివరిస్తూ, వాటిలో నిజం లేదని, ఆ మహిమలన్నీ మేజిక్ ట్రిక్కులేనని సందేశాన్ని ఈ సీరియల్ అందిస్తుంది.

ఇతర పాత్రల్లో సుబ్బరాయశర్మ, గుంటూరు శాస్త్రి, బిడిఎల్ సత్యనారాయణ, వై.వి.ఆర్.ఆచార్యులు, కళ్యాణ చక్రవర్తి, గుప్తా, శరత్‌కుమార్, కళారాణి, శ్రీలక్ష్మి, రత్నకుమారి, ఆకెళ్ల పద్మావతి కనిపించే ఈ సీరియల్‌లో మేజిక్ నేర్చుకునే అల్లరిపిల్లలుగా బేబీ కీర్తన, మాస్టర్ ప్రవీణ్, శ్రవణ్, సదానంద్, చైతన్య నటిస్తున్నారు.

కాన్సెప్ట్: బి.వి.పట్టాభిరాం, కథ-వి.ప్రకాశరావు, మాటలు-బ్నిం, సహకారం-జంధ్యం వెంకటేష్‌బాబు, కెమెరా- ఎడిటింగ్-రఘు, మేకప్-చంటి, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్- శ్రీనివాస విఠల్, కో డైరెక్టర్స్-మనోహర్, గాంధీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్-యం.విజయసేనారెడ్డి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం-వేణు ★

---

కతీతుడు కాదు. ఈ వయసుకో తోడు కావాలి. తన ముద్దూ ముచ్చటా ఆ అమ్మాయి ద్వారా తీరాలి. కాకపోతే పరిస్థితులు తెలుసుకున్న వాడు గనక, నాకు వుద్యోగం వచ్చేవరకూ పెళ్లి వద్దన్నాడు. ఇప్పటి పరిస్థితి చూస్తే ముసలాడయిపోయినా వుద్యోగం దొరికేట్టు లేదు. అందుకే తల్లి చెప్పిన మాట విని బుద్ధిగా పెళ్లి చేసేసు కోవటమే మంచిది. ఎలాగో బ్రతకొచ్చులే. ఈ అనంతకోటి ప్రజల్లో తనేనా బ్రతకలేక పోయేది అని తన మనస్సుని సముదా యించుకున్నాడు, ఆ అబ్బాయి.

అందరూ ఆడ పెళ్లివారింటికి బయలు దేరి వెళ్లారు. వీళ్లస్థాయిలోనే వాళ్లూ వున్నారు. అలాగే అమ్మాయి తండ్రికి మంచి గవర్నమెంట్ వుద్యోగం, సొంత యిల్లూ, నలుగురు పిల్లలూ. కాకపోతే వాళ్ల నలుగురూ ఆడపిల్లలు. అంతే తేడా, సరే. అమ్మాయిని అలంకరించి తెచ్చి కూర్చోబెట్టారు. ఫరవా లేదు. అన్నిటిలాగే అందం సరికి సరిలో వుంది. శారదమ్మ ఏవేవో ప్రశ్నలు వేసింది. కాస్సేపటికి అమ్మాయిని లోపలికి పంపించేశారు. ఆ యింటి యిల్లాలూ-శారదా కబుర్లు వేసుకున్నారు. మాటల సందర్భంలో అబ్బాయికేమీ వుద్యోగం లేదని తెలుసుకొందావిడ. వెంటనే సంభాషణ తృంచేసి ముభావంగా మారిపోయింది. శారదకు తల కొట్టేసినట్లనిపించింది. ''మావాడూ ప్రయత్నాలు చేస్తున్నాడండీ. ఎక్కడా. గవర్నమెంటు వుద్యోగం గగనమైపోయింది కదండీ. మావారూ ఎన్నో ప్రయత్నాలు చేసి చూశారు. ఫలితం కనిపించలేదు. మాకీ ప్రైవేటు వుద్యోగాలు చెయ్యించటం యిష్టంలేక వీణ్ణి వెళ్లనివ్వడం లేదు. అయినా మావారి సంపాదన ఎవరు తినాలండీ'' అంది లౌక్యంగా శారద. అని ఓ దెబ్బకొట్టింది-అక్కడికీ వాళ్ల ఆడపిల్లచేత ఏదో చేయించుకు బ్రతికిపోతున్నట్టు.

''ఎక్కడండీ. మా పిల్లలంతా పెద్ద చదువులవాళ్లే. ఖాళీగా కూర్చోలేక చేస్తుంది మా ఊర్మిళ. రేపు పెళ్లైతే వుద్యోగం మానేస్తుంది'' అని ఆవిడ ఎదురుదెబ్బ కొట్టింది.

''ఈ ఆడవాళ్లు మాట్లాడుకోవటంలో మహా చతురులే, మనం వినకగానీ'' అనుకున్నారా మగమహా రాజులు యిద్దరూ.

ఈ సంభాషణ తరువాత ఎటూ తేల్చుకోకుండానే ఆరోజు యింటికి వచ్చేశారు, ధర్మారావుగారి కుటుంబం.

తరువాత పెళ్లికూతురి గారింట్లో యీ పెళ్లి గురించి పెద్ద వాగ్యుద్ధమే జరిగింది. ''ఏమిటండీ మీరు. గొప్పగా బ్రతికితే సరిపోయిందా. మొగపిల్లాడు కావాలని ముచ్చట పడ్తూనే నలుగురు ఆడపిల్లలను కన్నాం మనం.''

''కంటే..యిప్పుడేవిటే'' అన్నాడాయన.

''ఏమిటేమిటి. ఇప్పటికి యిద్దరాడ పిల్లలకు పెళ్లిళ్లు చేశారు. ఒక్క అల్లుణ్ణయినా వుద్యోగస్థుణ్ణి సంపాదించ గలిగారా. ఇప్పుడీ మూడవ దానిక్కూడా ఓ పనిలేని పుల్లయ్యని అంటగట్టాలని చూస్తారా. నేను చస్తే యీ పెళ్లికి ఒప్పుకోనండీ'' అని శపథం చేసిందావిడ.

''నిజమేనే. నువ్వు చెప్పేదీ నిజమే. అయితే ఈరోజుల్లో గవర్నమెంటు వుద్యోగి ఎక్కడున్నాడే. అసలు మన గవర్నమెంటువారు ఎవరికైనా వుద్యోగాలు యిస్తే కదా, అలాంటి అల్లుడు మనకు దొరకటానికీ.''

''అంటే! పిల్లాడి తండ్రి రైల్వేలో ఆఫీసరు, పిల్లతండ్రి సెక్రటేరియట్‌లో ఆఫీసరూ అని చెప్పుకోవటమేగాని పిల్లలకేమీ వుండదన్నమాట.''

''అనేకదా అంటుంటా. అసలు గవర్నమెంటులోనే లేని నౌకరీలు మమ్మల్నెక్కడ్నుంచి తెమ్మంటావు చెప్పు.''

''అందుకే మీలాంటి ముసిలాళ్లకింకా సర్వీసు పెంచుతున్నారట వాళ్లు.''

''పోనీలేవే. నేను రిటైర్ కాకముందే యీ ఊర్మిళ పెళ్లి జరిగిపోతే యింకా ఆఖరుది వుండిపోతుంది కదే మనకూ. ఆలోచించు'' అన్నారాయన. ఆయనా ధర్మారావుగారి లాగానే దేక్కుంటూ వచ్చి యీ పాటికి సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా స్థిరపడ్డ జీవి.

★ ★ ★

ఈ రెండు కుటుంబాలను మనం చూశాం గనక యీ యువత ఎటు పోతుందీ అని ఆలోచిస్తాం. వీళ్లేకాక యింకా మూడోరకం కుటుంబాలుంటవి. వాళ్లకు యీ కుటుంబ నియంత్రణ పుణ్యాన సంతానం తక్కువగా వుంటుంది. అయ్యగారు వుద్యోగంలో చేరేనాటికి అమ్మాయి చంకనో బిడ్డ వుంటుంది. తరువాత మరో బిడ్డ, వీళ్లిద్దరూ వాళ్ల నాన్నగారు గుమాస్తాగా వుండగానే పెరిగి పెద్దవాళ్లై పెళ్లిళ్లు చేసుకుని వెళ్లిపోతున్నారు. తరువాత ఆ వుద్యోగి ప్రమోషన్ల మీద ప్రమోషన్లు అందుకొని రెండు చేతుల నిండా వచ్చిన జీతం- తరువాతింకా మిగిలిపోయిన సర్వీసూ-రిటైర్‌మెంట్ తరువాత ఏం చేసుకోవాలో తెలీనంత ఆదాయం. ఇలా ఎదిగిపోతున్న సగటు మానవుడూ-అలా నిరుద్యోగాల తో, ఆకలితో, అవమానాలతో విసిగిపోతున్న యువత రం-ఈ సంతాన నిరోధాలు విధించిన గవర్నమెంటు వారికి సర్వీసు నిరోధం కూడా విధించొచ్చని తెలీదా. ఈ అధిక జనాభా-నిరుద్యోగం అని వాపోతున్న అధికారులు- ఆ వుద్యోగాలే చెయ్యలేని ముసిలాళ్లని వయోపరిమితి పెంచి ఏడిపించే బదులు- కుర్రాళ్లకిస్తే అందరూ బ్రతకొచ్చని మన ప్రభుత్వాలకు తెలీకనా- లేక యీ ప్రజలనుంచి మరేదో ఆశించా.

ఈ ప్రభుత్వాలు యిదే మనస్తత్వంతో వున్నన్నాళ్లూ యిదొక 'అంతులేని కథ'.

★